సాక్షి విశాఖపట్నం

శనివారం ၊ 18 ၊ జనవరి ၊ 2025

న్యూస్‌రీల్

వెస్ట్ ఏసీపీగా పృథ్వితేజ

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో విశాఖ వెస్ట్ ఏసీపీగా అనుసూరి బాల సుభ పృథ్వితేజ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమల శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు విశాఖ వెస్ట్ ఏసీపీగా ఉన్న అన్నెపు నరసింహమూర్తిని ఇటీవలే ద్వారకా ఏసీపీగా అటాచ్ చేశారు. తాజాగా వెస్ట్ ఏసీపీగా పృథితేజను నియమించడంతో అన్నెపు నరసింహ మూర్తి ద్వారకా ఏసీపీగా అటాచ్‌మెంట్‌లో కొనసాగనున్నారు.

స్టీల్ ప్లాంట్ ప్యాకేజీపై ఇన్‌చార్జి మంత్రి హర్షం

మహారాణిపేట: విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు రూ.11.440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిన ప్రధాని మోడికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంటు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందనేదానికి ఈ ప్యాకేజీనే నిదర్శమన్నారు. మోడీ,బాబు జోడితోనే స్టీల్ ప్లాంటుకు పూర్వ వైభవం రానుందన్నారు.

ఫిబ్రవరి నాటికి మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ సిద్ధం



పనుల పురోగతిపై ఆరా తీస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ అత్యంత ప్రతిష్టాత్మకంగా రూ.80 కోట్లతో సిరిపురం జంక్షన్‌లో నిర్మిస్తున్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్‌ను ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కాంప్లెక్స్ నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. అసంపూర్తిగా ఉన్న పనులను గుర్తించి జనవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని గుత్తేదారు సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. వచ్చే సోమవారం మరోసారి పెండింగ్ పనులపై సమీక్షిస్తానన్నారు. పర్యటనలో ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, ఎస్ఈ బలరామరాజు, ఈఈలు మధుసూధన్, రామరాజు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

హౌస్ హోల్డ్ సర్వే ప్రక్రియను 30లోగా పూర్తి చేయాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రభుత్వం తలపెట్టిన హౌస్ హోల్డ్ సర్వే ప్రక్రియను ఈనెల 30వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. జోన్ -3 పరిధి న్యూ వెంకోజీపాలెం-1 సచివాలయాన్ని శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పలు అంశాలను పరిశీలించారు. సిబ్బంది పని తీరు, ప్రగతి సాధన, హాజరు శాతం తదితర అంశాలపై ఆరా తీస్తూ ఆయా రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు నిత్యం శ్రమించాలని హితవు పలికారు. ఆయన వెంట జిల్లా సచివాలయాల కో-ఆర్డినేటర్ ఉషారాణి, జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఉన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘం, సర్వసభ్య సమావేశాలు

మహారాణిపేట: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఉదయం 9.00 నుంచి 10.30 గంటల వరకు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ చాంబర్ సమీపంలోని వీసీ హాలులో, జెడ్పీ సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం నుంచి నిర్దేశిత సమయాల్లో జరుగుతాయని చెప్పారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు ఈ సమావేశాలకు హాజరుకావాలని కోరారు. ఉదయం 10.30 గంటల నుంచి సర్వసభ్య సమావేశం కొనసాగుతుందని, జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

కూటమి బెట్టింగ్ @140 కోట్లు!



బెట్టింగ్ రాయుళ్లు కూటమి నేతలే..!

- బెట్టింగ్‌లో కీలకంగా లగుడు రవి, బొబ్బిలి రవి
- కండువా కప్పి పార్టీలో చేర్చుకున్న పవన్, నాగబాబు
- ఇంకా పరారీలోనే నిందితులు
- ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు
- సహకరిస్తున్న కూటమి ఎమ్మెల్యేలు?
- 80 అకౌంట్లను పరిశీలించిన పోలీసులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

క్రికెట్ బెట్టింగ్ ముఠా వ్యవహారంలో కూటమి నేతలదే కీలకపాత్ర అని తెలుస్తోంది. ఈ ప్రధాన నిందితులు లగుడు రవితో పాటు కీలక పాత్ర పోషిస్తున్న బొబ్బిలి రవి పరారీలో ఉన్నారు. వీరిద్దరూ జనసేన పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో విచారణ చేస్తున్న విశాఖ సిటీ పోలీసులు ఇప్పటి వరకు జరిగిన 80 బ్యాంకు అకౌంట్లను పరిశీలిస్తే కేవలం ఏడాది కాలంలోనే రూ.140 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. అయితే ఇంకా వందల్లో గుర్తించిన బ్యాంకు అకౌంట్లను పరిశీలించాల్సి ఉందని సమాచారం. వీటి లావాదేవీలను గమనిస్తే ఇంకా ఎన్ని వందల కోట్లకు చేరుతుందనేది ఊహకు కూడా అందడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్రికెట్ బెట్టింగ్‌లో కీలకంగా ఉన్న లగుడు రవితో పాటు బొబ్బిలి రవి జనసేన పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇందులో బొబ్బిలి రవిని స్వయంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో పాటు నాగబాబు సమక్షంలో కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. వీరిని విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ చేర్చడం గమనార్హం. ఇప్పుడు ఈ ఫొటోలు వైరల్‌గా మారాయి. ఇక లగుడు రవి కూడా జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. ఇప్పటివరకు కేవలం లగుడు రవి ద్వారా వచ్చిన సమాచారంతో ఐదుగురిపై కేసులు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు.. తాజాగా మరో నలుగురిని అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టారు. వీరి బ్యాంకు లావాదేవీలు పరిశీలిస్తే.. రూ.140 కోట్లు ఉండగా..ఇంకా మొత్తం అకౌంట్లు పరిశీలిస్తే ఇంకా ఎన్ని వందల కోట్లకు చేరుతుందోనని చర్చ సాగుతోంది.

ఇంకా లెక్కతేలాల్సిందే...!

వాస్తవానికి కొద్దిరోజుల క్రితం ఇసుకతోట, శివాజీ పాలెం వద్ద జరుగుతున్న క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంపై వచ్చిన సమాచారం మేరకు ఈ నెల 6వ తేదీన టాస్క్‌ఫోర్స్ పోలీసులు జరిపిన దాడిలో లగుడు రవి కుమార్‌ను అదుపులో తీసుకున్నారు. అనంతరం జరిపిన విచారణలో ఇందులో మరో వ్యక్తి బొబ్బిలి రవి, త్రినాథ్, జిలానీ, కాకినాడకు చెందిన కార్తీక్‌ల పాత్ర కూడా తేలింది. ఇందులో ఇప్పటికీ బొబ్బిలి



బొబ్బిలి రవిని కండువా కప్పి పార్టీలో చేర్చుకున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్, నాగబాబు (ఫైల్)

రవితో పాటు మిగిలిన వ్యక్తులు అందరూ పరారీలోనే ఉన్నారు. వీరి కుటుంబ సభ్యులు కూడా ఇళ్లు వదిలి వెళ్లిపోయినట్టు తెలుస్తోంది. ఇప్పటివరకు లగుడు రవిని విచారించిన తర్వాత 80 బ్యాంకు అకౌంట్లను పరిశీలించగా... ఏడాది కాలంలోనే ఈ అకౌంట్ల ద్వారా రూ. 140 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్టు విశాఖ సిటీ పోలీసులు ప్రకటన విడుదల చేశారు. అయితే బొబ్బిలి రవిని, కాకినాడకు చెందిన కార్తీక్‌ను కూడా అదుపులోకి తీసుకుంటే ఇంకా ఎన్ని వందల సంఖ్యలో బ్యాంకు అకౌంట్లు ఉన్నాయో తెలిసే అవకాశం ఉంది. ఇదే జరిగితే మొత్తం క్రికెట్ బెట్టింగ్ ముఠా జరిపిన ఒక్క ఏడాది లావాదేవీలే మరిన్ని వందల కోట్లు ఉండే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అదుపులో తీసుకోకుండా...!

సుమారు 10 రోజుల క్రితం జరిగిన సంఘటనలో బొబ్బిలి రవి, త్రినాథ్‌లను అదుపులోనికి తీసుకోకుండా ఉండేందుకు కూటమి ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేసినట్టు విమర్శలున్నాయి. కూటమికి చెందిన ఎమ్మెల్యేతో పాటు పీఏలు కూడా అరెస్టు చేయవద్దంటూ సిఫారసులు చేశారనే ఆరోపణలున్నాయి.

ఈ నేపథ్యంలోనే బొబ్బిలి రవి పరారీలో ఉన్నారు. అంతేకాకుండా తన కుటుంబ సభ్యులను కూడా ఇంట్లో ఉండకుండా జాగ్రత్తపడినట్టు తెలుస్తోంది. మరోవైపు వీరికి ముందస్తు బెయిల్ కోసం కూడా కూటమి ఎమ్మెల్యేలు కొందరు ప్రయత్నిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికే ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేశారని... ఇందుకోసం ఒక ఎమ్మెల్యే పీఏ ఒక్కో వ్యక్తి నుంచి రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకూ వసూలు చేశారనే ప్రచారం ఆ పార్టీల్లోనే జరుగుతోంది. ఇదిలావుండగా తెర వెనుక కూటమి ఎమ్మెల్యే చేస్తున్న వ్యవహారం నగర పోలీసు కమిషనర్ దృష్టికి వెళ్లడంతో వారి ఆటలు సాగడం లేదన్న ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ సాధ్యం కాదని, వారిని కచ్చితంగా అదుపులో తీసుకుంటామని విశాఖ సిటీ పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

ఎవరీ కాకినాడ కార్తీక్...!

ఈ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో కీలకంగా ఉన్న కాకినాడ కార్తీక్ ఆచూకీ లభ్యం కాలేదు. కాకినాడకు వెళ్లి విచారించిన పోలీసులకు కార్తీక్ ఎవరనే విషయం మాత్రం బోధపడలేదని తెలుస్తోంది. కార్తీక్‌కు కాకినాడలో అనేక పేర్లతో వ్యవహారంలో ఉన్నాడని సమాచారం. ఒక్కొక్కరికి ఒక్కో పేరుతో కార్తీక్ పరిచయం కావడం గమనార్హం. అంతేకాకుండా పోలీసులు దర్యాప్తు కోసం వెళ్లే సమయానికే కుటుంబ సభ్యులతో కలిసి పరారయ్యారు. కార్తీక్‌కు విశాఖపట్నంతో పాటు హైదరాబాద్‌లో కూడా బెట్టింగ్ ముఠాతో సంబంధాలు ఉన్నట్టు తెలుస్తోంది. కార్తీక్‌ను కదిపితే బెట్టింగ్ మాఫియా వివరాలు మరిన్ని తెలిసే అవకాశం ఉంది.

ముసాయిదా సవరణలకు ప్రజాభిప్రాయ సేకరణ

విశాఖ సిటీ: సెక్యూరిటీ డిపాజిట్లు, విద్యుత్ సరఫరా లైసెన్స్ ఫీజు, ఇతర అంశాలపై ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(ఏపీఈఆర్‌సీ) ముసాయిదా సవరణలకు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు ఈఆర్‌సీ చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ పేర్కొన్నారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో డిస్కంలకు సంబంధించిన ఆదాయ అవసరాలు, టారిఫ్‌ల పెంపు మీద ఈఆర్‌సీ రాష్ట్ర సలహా కమిటీ సమావేశాన్ని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కాలంలో చేపట్టిన సంస్కరణలు, నిర్ణయాలను వివరించారు. ప్రధానంగా సోలార్ రూఫ్‌టాప్, గ్రీన్ ఎనర్జీ ప్రోత్సాహానికి తీసుకున్న చర్యలను విశదీకరించారు. డిస్కంలు గుర్తించిన వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు వాణిజ్య, పరిశ్రమలు, రవాణా, వ్యవసాయం, కార్మిక, వినియోగదారుల, ప్రభుత్వేతర సంస్థల విజ్ఞప్తులను ఈఆర్‌సీ దృష్టికి తీసుకువెళ్లారు. అదే విధంగా డిస్కంలకు ఆదాయ అవసరాలు, టారిఫ్ పెంపు వంటి విషయాలపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఏపీఈఆర్‌సీ సభ్యుడు పి.వి.ఆర్.రెడ్డి, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ్, ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు, ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్(గ్రిడ్) ఎ.వి.కె.భాస్కర్, ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్(ఫైనాన్స్) రామ్‌దాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

మహారాణిపేట: జనవరి 26న పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే గణతంత్ర వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ పేర్కొన్నారు. వేడుకల నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం కలెక్టరేట్ మీటింగు హాలులో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతిబింబిస్తూ శకటాలను తీర్చిదిద్దాలని, స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియపరిచేలా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయాలని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, గీతాలాపన, ప్రగతి నివేదిక ఇతర అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులంతా సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో భాగంగా ఎవరెవరు ఏయే బాధ్యతలు నిర్వర్తించాలో స్పష్టంగా తెలుపుతూ జేసీ దిశానిర్దేశం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, పోలీస్, రెవెన్యూ, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్, చిత్రంలో డీఆర్‌వో భవానీ శంకర్



ప్యాకేజీ ఓకే... ఉక్కు భవితేంటి?

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడాన్ని ఉద్యోగులు స్వాగతిస్తున్నారు. ఈ ప్యాకేజీ రూ.11,440 కోట్లలో రూ.10,300 కోట్లు కొత్తగా ఈక్విటీగా మార్చడానికి, మిగిలిన రూ.1,140 కోట్లు వర్కింగ్ క్యాపిటల్‌ను ప్రిఫరెన్షియల్ షేర్లుగా మార్చడానికి వినియోగించనున్నారని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. స్టీల్‌ప్లాంట్‌కు ప్రస్తుతం ఉన్న సుమారు రూ.25 వేల కోట్లు భారంలో ఈ ప్యాకేజీ ఎంత వరకు ఉపయోగపడుతుంది, ఈ ప్యాకేజీతో ఉద్యోగులకు, ఉద్యోగులకు చెందిన ఆర్థిక అంశాలకు ఎంత వరకు ప్రయోజనం చేకూరుతుందనే అంశంపై చర్చ జరుగుతోంది. ఇప్పటికే రెండున్నర నెలల జీతం పెండింగ్‌లో ఉండగా సుమారు రూ.1000 కోట్లు పీఎఫ్ ట్రస్ట్, ఎస్‌బీఎఫ్ ట్రస్ట్, త్రిఫ్ట్ సొసైటీ, ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ తదితర సంస్థలకు చెల్లించాల్సి ఉంది. వీటితో పాటు ఇటీవల యాజమాన్యం విడుదల చేసిన వీఆర్ఎస్ స్కీంకు అవసరమైన సొమ్ము ఈ ప్యాకేజీ నుంచి చెల్లిస్తారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్యాకేజీ ద్వారా స్టీల్‌ప్లాంట్ పూర్తి ఉత్పత్తి సామర్థ్యం సాధనకు వినియోగించడానికి అందరికీ ఆమోదయోగ్యమే కాని ఇది శాశ్వత పరిష్కారమవుతుందా అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్యాకేజీ వల్ల తాత్కాలిక ఉపశమనమే కాని శాశ్వత పరిష్కారం కాదని కార్మిక నాయకులు అభిప్రాయపడుతున్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించడం, సెయిల్‌లో విలీనం మాత్రమే శాశ్వత పరిష్కారమని చెబుతున్నారు.

సెయిల్‌లో విలీనంతోనే పూర్తి పరిష్కారం



కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించడం పోరాట కమిటీ స్వాగతిస్తోంది. అయితే ఈ ప్యాకేజీ వల్ల పూర్తి పరిష్కారం లభించదు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం చాలా ముఖ్యమైన అంశం. అదే విధంగా ఈ ప్యాకేజీ ద్వారా కార్మికులకు రావాల్సిన అన్ని ప్రయోజనాలు వెంటనే కల్పించాలి.

– కె.ఎస్.ఎన్. రావు, కన్వీనర్, ఉక్కు పోరాట కమిటీ

పోరాట కమిటీ విజయం



స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకున్న కేంద్ర కేబినెట్ కమిటీ స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీప్రకటించడం పోరాట కమిటీ విజయం. ఈ ప్యాకేజీతో స్టీల్ ప్లాంట్‌కు శాశ్వత పరిష్కారం కాదు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి, సొంత గనులు కేటాయించాలి, రాష్ట్రపతి పేరిట ఉన్న భూములను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మార్చాలి. అదే విధంగా కొత్త నియామకాలు చేపట్టాలి, నాలుగేళ్ల పాటు ట్యాక్స్ హాలిడే కల్పించాలి.

– జె.అయోధ్యరామ్, కో-కన్వీనర్ ఉక్కు పోరాట కమిటీ

సొంత గనులు కేటాయించాలి



స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తేనే శాశ్వత పరిష్కారం అవుతుంది. సొంత గనులు లేకపోవడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగిపోతోంది. ప్యాకేజీ ప్రకటించడం ఆమోదయోగ్యమే అయితే దీని ద్వారా ప్లాంట్‌కు ఏవిధంగా ఉపయోగపడుతుందో పరిశీలించాల్సి ఉంది. ఈ ప్యాకేజీ ద్వారా ప్లాంట్ పూర్తి ఉత్పత్తి సామర్థ్యం సాధించడంతో పాటు కార్మికుల ప్రయోజనాలు కాపాడతారని భావిస్తున్నాం.

– ఎం.వి. రమణమూర్తి, అధ్యక్షుడు, స్టీల్ ఐఎన్‌టీయూసీ

అమ్మో..అంబులెన్స్



ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో ఈ ఫొటోలే నిదర్శనం. ఒక అంబులెన్సులో క్షతగాత్రులను, వివిధ రోగాలతో బాధపడుతున్న వారిని కుక్కేశారు. బస్సులో ఎక్కించినట్లు అంబులెన్సులో చోటు లేకపోయినా రోగులను నిలబెట్టేసి మరీ ఓపీ నుంచి వార్డులకు తరలించారు. అందులో కొంత మంది ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉన్నప్పటికీ.. ఎవరూ పట్టించుకోలేదు. ఒక చిన్నారిని ఎత్తుకొని తీసుకువెళుతున్న దృశ్యం అందరి కలిచివేసింది. రోగులను వీల్‌చైర్లు, స్ట్రెచర్‌లో తరలించాల్సి ఉన్నా..సిబ్బంది ఇలా ఇష్టానుసారంగా అంబులెన్సులో కుక్కి తీసుకువెళ్లడంపై రోగుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు.







– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కాయ్ రాజా కాయ్

- యథేచ్ఛగా కోడి పందేలు
- పేకాట, గుండాటలు కూడా..
- పోలీసుల కళ్లు గప్పి తోటలు, చెరువు గట్లపై నిర్వహణ
- శివరాత్రి వరకు కోలాహలం
- పేకాట, లాటరీ బల్లలతో భారీగా చేతులు మారుతున్న నగదు



తలపడుతున్న కోళ్లు

పెందుర్తి: సంక్రాంతి ముగిసి పరసల సందడి మొదలయిందంటే పందెం రాయుళ్లకు పండగే. మహా శివరాత్రి వరకు వీరు ఆడిందే ఆట. సంక్రాంతి మూడు రోజుల్లో జరిగే పందేలకు కొనసాగింపుగా పరస/తీర్థాల్లో దాదాపు రెండు నెలల పాటు గ్రామాల్లో ఈ జోరు కొనసాగుతోంది. తోటలు.. చెరువు గట్లు.. గుట్టు చప్పుడు కానీ ప్రతిచోటా పందాలతో పండగను రక్తి కట్టిస్తుంటారు. ఓ వైపు కోడి పందాలు.. మరోవైపు పేకాట.. ఇంకో వైపు లాటరీ బల్లలు.. కాయ్‌రాజా కాయ్ అంటూ తమదైన శైలిలో 'క్రీడా'స్ఫూర్తి రగిలిస్తుంటారు. అయితే వీరి ఆటలకు అడ్డుకట్ట వేస్తామంటూ పోలీసులు చెబుతున్నప్పటికీ అధికార టీడీపీ, జనసేన గ్రామస్థాయి నాయకుల అండదండలతో పందేలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా సబ్బవరం మండలంలో ప్రతి పరసలోనూ పందాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. పెందుర్తి గ్రామీణ ప్రాంతంలో కూడా జూదం జోరుగా జరుగుతోంది. మరోవైపు ఈ శిబిరాల వద్దే తాత్కాలిక బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసి ఇష్టానుసారంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి.



ఇటీవల పెందుర్తి పోలీసులు స్వాధీనం చేసుకున్న పందెం కోళ్లు

జూదానికి అనుకూలం..

పెందుర్తి నియోజకవర్గంలో తోటలు అధికం. పెందుర్తి, అక్కిరెడ్డిపాలెం, నరవ, జెర్రిపోతులపాలెం, సతివానిపాలెం, చినముషిడివాడ వుడా కాలనీ, సబ్బవరం, పరవాడ తదితర ప్రాంతాల్లో వందల ఎకరాల్లో జీడిమామిడి, మామిడి, సరుగుడు తోటలు ఉన్నాయి. ఇవి చాలా వరకు పేకాట, కోడి పందాలకు అనుకూలంగా ఉన్నాయి. వీటితో పాటు అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు కూడా పేకాటకు అనుకూలంగా ఉంటున్నాయి. ఏటా సంక్రాంతి సమయంలో ఆయా ప్రాంతాలే పందెంరాయుళ్ల స్థావరాలు. వీటిని ప్రత్యేకంగా కొందరు వ్యక్తులు నడిస్తున్నారు. వీరు ఆటకు ఇంత అని నిర్ధారించి ఆటగాళ్ల దగ్గర వసూలు చేస్తుంటారు. ఆటగాళ్లకు మద్యం, ఇతర సౌకర్యాలు కల్పిస్తుంటారు. ఇదిలా ఉండగా ఆటలో పందేలు రూ.లక్షల్లోనే ఉంటాయి. ఆటగాళ్లు చాలా వరకు నేరుగా డబ్బుతోనే ఆటకు దిగుతారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుని స్మార్ట్ ఫోన్ల ద్వారా అక్కడికక్కడే ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్లు కూడా జరుగుతుండడం విశేషం. మరికొంత మంది భూములు, వాహనాల పత్రాలు పెట్టి పందేలు కాస్తుంటారు.

వడ్డీ వ్యాపారులకు ఆదాయం

మరోవైపు పందెంరాయుళ్ల బలహీనత ప్రైవేటు వడ్డీ వ్యాపారులకు వరంగా మారింది. పందేల్లో నగదు అయిపోయిన వారు డబ్బు కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వాహనాలు, భూముల పత్రాలు తాకట్టు పెట్టి నగదు తీసుకుని పందేలు కాస్తున్నారు. పందెంరాయుళ్ల అవసరాన్ని బట్టి రోజుకు రూ. వందకు రూ.5 నుంచి రూ. 10వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. పందాలు దాదాపు అన్ని గ్రామాల్లోనూ టీడీపీ/జనసేన నాయకులే దగ్గరుండి నడిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వడ్డీ వ్యాపారంలో కూడా వారే అదనపు ఆదాయం సమకూర్చుకుంటున్నారని సమాచారం.

కఠినంగా వ్యవహరిస్తాం..



పరసల్లో జూదాలు, కోడి పందేలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా నిషేధం. ఇప్పటికే పెందుర్తిలో పందేలు ఆడే వారిని, కోళ్లకు కత్తులు కట్టే వారిని పిలిపించి బైండోవర్ చేశాం. మరి కొంత మందికి కౌన్సెలింగ్ ఇచ్చాం. పందేలు నిర్వహించేవారు ఎంతటి వారైనా వదిలిపెట్టం. ఇతర నేరాలపై కూడా మా సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రజలు కూడా ఇటువంటి వాటిపై సమాచారం ఇచ్చి సహకరించాలి. 94407 96039, 0891-2764233 నంబర్లలో సంప్రదించాలి.

– కె.వి. సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

విజయవంతంగా 'స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్'

- కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశం
- నేడు శివాజీపాలెం పార్కులో..



మాట్లాడుతున్న హరేందిర ప్రసాద్

మహారాణిపేట: దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని, దానికి తగిన కార్యాచరణ రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సూచించారు. వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు, జోనల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఇతర అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. 'స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్'పై దిశానిర్దేశం చేశారు. జనవరి నుంచి డిసెంబర్ వరకు 12 నెలల పాటు నెలకొక థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఈనెల 18వ తేదీ నుంచి న్యూ ఇయర్ – క్లీన్ స్టార్ థీమ్‌తో కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఉదయం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టాలని, గార్బేజ్ క్లీనింగ్, టాయిలెట్ల క్లీనింగ్ చేయాలన్నారు. పబ్లిక్ టాయిలెట్స్, బస్ స్టాప్‌లను శుభ్రం చేయాలన్నారు. ప్లాస్టిక్ నిషేధం ప్రభుత్వ కార్యాలయాల నుంచే ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలకు 18వ తేదీన సెలవు కాబట్టి, వాటిలో వచ్చే శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. పంచాయతీరాజ్ ద్వారా వాటర్ ట్యాంక్ క్లీనింగ్‌తో పాటు డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. ప్రతి కార్యాలయంలో జిల్లా నోడల్ అధికారిని ఏర్పాటు చేసి క్లీనింగ్ చేసిన ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, డీఆర్వో బి.హెచ్. భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ పార్కు వద్ద ..

ముఖ్యమంత్రి చేతుల మీదుగా కడప జిల్లా మైదుకూరులో శనివారం రాష్ట్ర స్థాయి కార్యక్రమం ప్రారంభం కానుండగా.. జిల్లా స్థాయి కార్యక్రమం స్థానిక శివాజీ పార్కులో కలెక్టర్ చేతుల మీదుగా జరగనుంది. ఈ మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు.

మార్గదర్శకాలను అనుగుణంగా ...

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జీవీఎంసీ పరిధిలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. రాష్ట్రప్రభుత్వ మార్గదర్శకాలపై ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని జీవీఎంసీ జోన్–3 పరిధి శివాజీ పార్క్‌లో ఈ నెల 18న ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సారథ్యంలో నిర్వహించనున్నట్టు కమిషనర్ తెలిపారు. సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి. రమణమూర్తి, ఎస్.ఎస్. వర్మ, ఆర్. సోమనారాయణ, ప్రధాన ఇంజినీర్ పి.శివప్రసాదరాజు, ముఖ్య పట్టణ ప్రణాళికా అధికారి ప్రభాకరరావు, డీసీఆర్ ఎస్. శ్రీనివాస్, యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్టాఫ్ నర్సుల పోస్టుల దరఖాస్తుల గడువు

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారంతో ముగిసింది. ఆఫ్‌లైన్‌లో 8,250 దరఖాస్తులు వచ్చాయని, ఆన్‌లైన్ కూడా దరఖాస్తులు పెద్దసంఖ్యలో వచ్చాయని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ పి.రాధారాణి తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టులకు ఏడాది ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, విశాఖ జిల్లాలో ఖాళీగా ఉన్న 106 స్టాఫ్ నర్సు పోస్టులు భర్తీ చేస్తున్నారు. పూర్తి వివరాల కోసం https@//nagendrasvst.wordpress.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

చైనా మాంజాతో వృద్ధుడి ముక్కుకు గాయం

- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం
- బీచ్‌రోడ్డులో సంఘటన
- నిషేధం ఉన్నా ఆగని చైనా మాంజాల విక్రయాలు



ప్రమాదానికి కారణమైన చైనా మాంజా కలిగిన గాలిపటం, (ఇన్‌సెట్) గాయపడిన వృద్ధుడు

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులో చైనా మాంజా తగిలి ఓ వృద్ధుడి ముక్కుపై కోసుకుపోయింది. త్రుటిలో ప్రమాదం తప్పింది. కోస్టల్ బ్యాటరీ నుంచి నోవొటెల్ హోటల్‌కి వెళ్లే మార్గంలో శుక్రవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించి వెళుతున్న వృద్ధునికి గాలిపటం ఎగురవేయడానికి ఉపయోగించే దారం(చైనా మాంజా) తలిగింది.

దీనిని హెల్మెట్ అద్దం కూడా ఆపలేకపోయింది. పదునైన చైనా మాంజా తగిలి వృద్ధుని ముక్కుప్రాంతంలో గాయమైంది. తీవ్రంగా రక్తస్రావమై వృద్ధుని దుస్తులు రక్తంతో తడిసిపోయాయి. వెంటనే స్థానికులు స్పందించి బాధితుడికి సపర్యలు చేసి, ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడు వాహనంపై నెమ్మదిగా వెళ్లడం, హెల్మెట్ ధరించడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసుల వద్ద ఎటువంటి సమాచారం లేకపోవడం గమనార్హం.

ప్రమాదకరం...చైనా మాంజా

ప్రమాదకరమైన చైనా మాంజాపై నిషేధం ఉంది. పతంగులు ఎగురవేసేందుకు ఉపయోగించే దారానికి సన్నని గాజు పొడిని పూస్తారు. గాలిపటాల పోటీలు జరిగే సమయంలో వేరొకరి గాలిపటం దారాన్ని కత్తిరించడానికి దీనిని వినియోగిస్తారు. గతంలో ఈ చైనా మాంజా కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. దీంతో ఈ చైనా మాంజాపై నిషేధం ఉంది. వీటిని విక్రయించవద్దని పోలీసులు వ్యాపారులకు స్పష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చారు. అయినప్పటికీ విక్రయాలు కొనసాగుతున్నాయి.

వాల్తేర్ డివిజన్‌కు ఆరు అవార్డులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్‌రైల్వే వాల్తేర్ డివిజన్‌కు వివిధ విభాగాలలో కనబర్చిన ఉత్తమ ఫలితాలకు గాను ఆరు అవార్డులను (ఆరు రన్నింగ్ ఎఫిషియన్సీ షీల్డ్)లను అందుకోనుంది. ఈ మేరకు ఈస్ట్‌కోస్ట్‌రైల్వే ప్రధాన కారాలయం నుంచి ప్రకటన వెలువడింది. 69వ రైల్వే వారోత్సవాల సందర్భంగా ఈ నెల 31వ తేదీన జనరల్ మేనేజర్ చేతుల మీదుగా వాల్తేర్ డివిజన్ అధికారులు అందుకోనున్నారు. సివిల్ ఇంజినీరింగ్, కమర్షియల్, మెడికల్, సెక్యూరిటీ, స్టోర్స్ విభాగం, ట్రాక్ మెషీన్ వంటి ఆరు విభాగాలలో వాల్తేర్ డివిజన్ ఈ షీల్డ్‌లను గెలుచుకుంది. ఓవరాల్ విజేతను వేడుకలు జరిగే రోజున ప్రకటించనున్నారు.

గ్యాస్‌కు అదనంగా నగదు వసూలు చేస్తే చర్యలు

- ఏజెన్సీల లైసెన్స్ రద్దు చేస్తాం
- జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: నిర్దేశించిన ధర కంటే గ్యాస్ ఏజెన్సీలకు చెందిన డెలివరీ బాయ్‌లు అదనంగా నగదు వసూలు చేస్తే సంబంధిత డీలర్లు/ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ హెచ్చరించారు. అలాంటి గ్యాస్ ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టడంతోపాటు వారి లైసెన్సులను రద్దు చేస్తామని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. బిల్లు కన్నా అదనంగా రూ.80 నుంచి రూ. 150 వరకూ గ్యాస్ డెలివరీ బాయ్‌లు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు రావడంతో గ్యాస్ ఏజెన్సీల సేల్స్ అధికారులతో సమావేశం నిర్వహించి, ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఎవరైనా అదనంగా డబ్బులు అడిగితే 0891-2590100, 0891-2590102 అనే టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

సాయుధ దళాల పతాక నిధి విరాళాల సేకరణలో జిల్లా ప్రథమం



ట్రోఫీ, సర్టిఫికెట్‌ను కలెక్టర్‌కు అందజేస్తున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి సత్యానందం

మహారాణిపేట: సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని పతాక నిధికి సేకరించిన విరాళాల సేకరణలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పిలుపు మేరకు పలు సంస్థలు, అధికారులు, సామాజిక కార్యకర్తలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ.24.48 లక్షల విరాళం అందజేశారు. రాష్ట్రంలో ఇంత మొత్తం సేకరించిన జిల్లాల్లో విశాఖ జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా, రాష్ట్ర గవర్నర్ ఈ నెల 12న విజయవాడ వేదికగా ట్రోఫీ, ధ్రువీకరణ పత్రాన్ని బహూకరించారు. సంబంధిత ట్రోఫీని, పత్రాలను జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి. సత్యానందం తన కార్యాలయ సిబ్బందితో కలిసి శుక్రవారం కలెక్టర్‌కు అందజేశారు.

వారసత్వ వస్త్ర సంపదకు కేరాఫ్ 'నేషనల్ సిల్క్ ఎక్స్‌పో'



డాబాగార్డెన్స్: భారతదేశపు విలువైన వారసత్వ వస్త్ర సంపదకు కేరాఫ్‌గా నేషనల్ సిల్క్ ఎక్స్‌పో నిలిచింది. పండగలు, వివాహాది శుభకార్యాలకు, ఇతర కార్యక్రమాలకు వస్త్రాలను సమకూర్చేందుకు ఒకే వేదికగా నిలుస్తోంది. నగరంలోని హోటల్ గ్రీన్ పార్క్‌లోఈ నెల 16 నుంచి 20వరకు భారతీయ విలువైన వారసత్వ సంపదంతా ఒకే ప్లాట్‌ఫాంపైకి తెచ్చారు. దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు కలబోసిన వివిధ రాష్ట్రాలకు చెందిన మగ్గాల ఉత్పత్తులన్నింటిని ఈ ప్లాట్‌ఫాంపై చేర్చినట్టు నిర్వాహకులు తెలిపారు. నేత కార్మికులు 50 శాతం తగ్గింపు ధరలతో వేలాది రకాల సిల్క్, కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజ్‌లు, కుర్తీలు వంటి వస్త్రాలు ఒకే వేదికపైకి తీసుకొచ్చినట్టు చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నేరుగా తయారీదారుల నుంచి సేకరించిన వస్త్రాలను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. మహారాష్ట్ర నుంచి సొగసైన పైథాని సిల్క్ చీరలు, కర్ణాటక బెంగుళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కాషిదా సిల్క్ చీరలు, మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రసిద్ధ చందేరి, మహేశ్వరి సిల్క్ చీరలు, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర బలూచారి, జమ్దానీ, టాంగైల్, ఢకాయ మాస్లిన్ సిల్క్ చీరల ప్రదర్శన, విక్రయాలను అందుబాటు ధరల్లో ఉంచినట్టు చెప్పారు. దుప్పట్లు, సల్వార్ మెటీరియల్, బిహార్‌కు చెందిన టస్సార్, మట్కా, భాగల్పూర్, గుజరాత్ సంప్రదాయ బంధిని, కచ్ ఎంబ్రాయిడరీ, పటోల చీరలు, తమిళనాడు కంజీవరంతో పాటు ఎన్నో మరెన్నో చీరలు అందుబాటు ధరల్లో ఉంచినట్టు తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

లారీ చక్రాల కిందపడి మహిళ దుర్మరణం



శ్యామల (ఫైల్)

పీఎం పాలెం/డాబాగార్డెన్స్: జాతీయరహదారిపై ఎండాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. పీఎం పాలెం ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.విజయ్, స్థానికులు తెలిపిన వివరాలు.. మద్దిలపాలెంలో ఒమ్మి శ్యామల (47) నివాసముంటోంది. ఈమె భర్త కొన్నేళ్ల కిందట మృతి చెందాడు. అప్పటి నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తూ తన ఇద్దరు కుమార్తెలకు అన్నీతానై నిలిచింది. ఈమె సోదరుడు కోన శ్రీనివాస్ ఈ నెల 3వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నెల 18(శనివారం)న సోదరుడి దశ దిన కర్మ కృష్ణా కాలేజీ సమీపాన గల సోదరుడి ఇంటి వద్ద నిర్వహించనున్నారు. ఇందుకు కావలసిన పువ్వుల కోసం శ్యామల ఆనందపురం పూలమార్కెట్‌కు శుక్రవారం వెళ్లింది. వరుసకు మేనల్లుడైన కూన రాజేష్ స్కూటీ డ్రైవ్ చేస్తుండగా తిరుగు ప్రయాణం అయ్యారు.ఎండాడ కూడలికి సమీపంలోకి వచ్చే సరికి అదే రోడ్డులో ముందు వెళుతున్న కారు డోరు సరిగా వేయకపోవడంతో ఆ విషయం కారు డ్రైవర్‌కు తెలియజేయడానికి రాజేష్ స్కూటీని వేగంగా ముందుకు పోనిచ్చాడు. ఈ సమయంలో అదే రోడ్డులో పైడి భీమవరం నుంచి విశాఖ పోర్టుకు వస్తున్న లారీ, స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్యామల కింద పడి పోవడంతో ఆమె తలమీదనుంచి లారీ వెనుక చక్రం వెళ్లిపోయింది. సంఘటన స్థలంలోనే ఆమె మృతి చెందింది. ఈమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్యామల మృతితో వారు అనాథలయ్యారు. మరో కొద్దిసేపట్లో ఇంటికి చేరుకోవలసిన శ్యామల ఇంతలోనే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు గుండెలవిసేలా రోదించారు.

'మిషన్ వాత్సల్య' దరఖాస్తులకు నేటితో గడువు పూర్తి

ఎంవీపీకాలనీ: జిల్లా మహిళ, శిశు సంక్షేమం, సాధికారత శాఖ పరిధిలోని మిషన్ వాత్సల్య పథకంలోని ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుకు శనివారంతో గడువు ముగియనుంది. ప్రొటెక్షన్ ఆఫీసర్ 1, డాక్టర్ (పార్ట్‌టైం) 1, ఆయా 1 పోస్టులకు ఇటీవల ఆ శాఖ దరఖాస్తులను ఆహ్వానించిన విషయం తెలిసిందే. 2024 జూలై ఒకటో తేదీ నాటికి 25 ఏళ్లు నిండి, 42 ఏళ్లలోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత గల అభ్యర్థులు htpp://visakhapatnam.ap.gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను పొందవచ్చు. శనివారం సాయంత్రం 5 గంటలలోపు అర్హులు వారి దరఖాస్తులను ఎంవీపీ కాలనీ సెక్టార్–9, డీఆర్‌డీఏ కార్యాలయంలోని జిల్లా మహిళ, శిశు సంక్షేమం, సాధికారత శాఖ కార్యాలయంలో అందజేయాలి.

ఘనంగా ఐఐఎం వ్యవస్థాపక దినోత్సవం



భారత ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ సమీర్ వి. కామత్‌కు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరంలో 240 ఎకరాల విస్తర్ణంలో ఉన్న ఐఐఎం క్యాంపస్‌లో 11వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ సమీర్ వి. కామత్ ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఫల్యాల ద్వారా పాఠాలు నేర్చుకోవచ్చన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ అనే నినాదంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని చెప్పారు. ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాల్లో ఐఐఎం ఎన్నో మైలురాళ్లను దాటిందని, అధిక నాణ్యత గల విద్యను అందించడలో ప్రఖ్యాతిని పొందిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం సభ్యురాలు మాళవిక, హరిత తదితరులు పాల్గొన్నారు.

ఆగని తీరం కోత



సముద్రతీరానికి కోత తప్పడం లేదు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో సముద్రం కోతకు గురవుతోంది. కొద్ది రోజుల క్రితం నోవాటెల్ ఎదురుగా ఉన్న పార్క్ సమీపంలో సముద్రం తీవ్రంగా కోతకు గురికాగా..పక్కనే ఉన్న పార్క్ ప్రహరీ సైతం కూలిపోయింది. తాజాగా శుక్రవారం మరికొంత మేర కోతకు గురైంది. నిపుణులతో అధ్యయనం చేసి శాశ్వత పరిష్కారాన్ని అన్వేషించి, విశాఖలోని సముద్ర తీరాన్ని సంరక్షించాలని నగరవాసులు కోరుతున్నారు.

-ఏయూ క్యాంపస్/ ఫొటో : సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం

బులియన్..

అల్లిపురం (విశాఖ దక్షిణం):

బంగారం (10 గ్రాములు)	
24 కేరట్లు:	రూ.81,270
22 కేరట్లు:	రూ.74,500
వెండి (కిలో):	రూ.1,04,000

తాబేళ్ల మృత్యుఘోష



జాలరిపేట తీరంలో ఆలీవ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు

భూమిపై, సముద్రంలో జీవులకు రక్షణ లేకుండా పోయింది. మానవ తప్పిదాలు, పెరుగుతున్న కాలుష్యంతో తీరంలో తాబేళ్ల మృత్యుఘోష వినిపిస్తోంది. సముద్ర తీరప్రాంతాల్లో గుడ్లు పెట్టేందుకు వస్తున్న తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీంతో వాటి కళేబరాలు తీరానికి నిత్యం కొట్టుకొస్తున్నాయి. గత కొద్దిరోజులుగా నిత్యం పదుల సంఖ్యలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు తీరానికి కొట్టుకురావడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా శుక్రవారం పలు ఆలివ్‌రిడ్లే తాబేళ్లు మృత్యువాత పడి సాగరతీరానికి కొట్టుకొచ్చాయి. వీటిని చూసి నగరవాసులు తీవ్ర ఆవేదన చెందారు.

- ఫొటో : సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం

'ఏఐసీవోజీ'లో ఆంధ్రా మెడికల్ కాలేజీ గైనిక్ వైద్యుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన గైనిక్ వైద్యులను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: ముంబైలో జరిగిన 67వ ఆల్ ఇండియా వార్షిక కాంగ్రెస్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ జెనెకాలజీ (ఏఐసీవోజీ) సమావేశంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ గైనిక్ విభాగం వైద్యులు,వైద్య విద్యార్థులు అకడమిక్ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు గైనిక్ విభాగ వైద్యులను అభినందించారు. జాతీయ కాంగ్రెస్ అకడమిక్‌లో ప్రతిభ కనబరిచిన వైద్యులను ప్రిన్సిపాల్ ప్రశంసించారు.

దేశ వ్యాప్తంగా గైనిక్ అధ్యాపకులు పీజీ విద్యార్థులతో సహా దాదాపు వేయి మంది ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పీజీ విద్యార్థులు డాక్టర్ మాధురి నరహరిశెట్టి, డాక్టర్ శ్రీలేఖ చిందిరాల, డాక్టర్ రాగ శ్రీ పామర్తి, డాక్టర్ రంజిని పెద్దిరెడ్డి, డాక్టర్ షీలు సోనియా గుత్తికొండ, మూడవ సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్ మాధురి అవార్డులు పొందారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ గైనాకాలజీ విభాగాధిపతి డాక్టర్ సంధ్యా దేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డాక్టర్ సి.అమూల్య, డాక్టర్ జి.సౌమిని, డాక్టర్ జి. శైలజ, డాక్టర్ ఉషా ప్రసాద్, డాక్టర్ అనురాధ, డాక్టర్ పి.శైలజ మార్గదర్శకత్వంలో పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్‌ఇచ్చారు. డాక్టర్ గీతా వందన, డాక్టర్ విద్యా రామ కూడా వార్షిక జాతీయ కాంగ్రెస్‌లో అకడమిక్ ప్రతిభ కనబరిచారు.